చురుగ్గా పనులు

- అభివృద్ధి పథంలో 45వ వార్డు
- రూ.5.60 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణాలు



మెరిసిపోతున్న నరసింహనగర్ మెయిన్ రోడ్డు



సత్యసాయినగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పనులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధితోపాటు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా వార్డులో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ప్రత్యేక చొరవతో మంజూరు చేయించి పూర్తి చేయిస్తున్నారు. వార్డులో ఇప్పటివరకు సుమారు రూ.5.60 కోట్లతో పనులు ప్రారంభించారు. వీటిలో కొన్ని పూర్తి కాగా.. మరి కొన్ని పనులు తుదిదశలో ఉన్నాయి. మరో రెండు ప్రాజెక్టులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. సంతోషిమాత కాలనీ, సింహగిరి కాలనీల్లో సామాజిక భవనాలకు నిధులు మంజూరై, టెండర్లు పిలిచినా.. ఎవరూ రాకపోవడంతో ఈ పనులు మాత్రం నిలిచిపోయాయి.

ప్రాంతాలు.. నిధులు.. పనులు

జనరల్ వర్క్స్ జాబితాలో రూ.3.44 కోట్ల నిధులతో నరసింహనగర్‌లో బీటీ రోడ్లు, గణేష్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. వీటిలో నరసింహనగర్ మెయిన్ రోడ్, అప్రోచ్ రోడ్ పనులు పూర్తికాగా.. గణేష్‌నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. వార్డు డెవలప్‌మెంట్ నిధులు సుమారు రూ.1.68 కోట్లతో చిట్టిబాబు కాలనీ, సంతోషిమాత కాలనీ, తారకరామానగర్, రామచంద్రనగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు పూర్తిచేశారు. రామచంద్రనగర్, సంతోషిమాత కాలనీల్లో సెప్టిక్ ట్యాంక్‌లు నిర్మించారు. సింహగిరి కాలనీ, సత్యసాయినగర్ కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలను ఆధునికీకరించారు. ఇవి కూడా తుదిదశలో ఉన్నాయి.

'గడప గడపకు మన ప్రభుత్వం' పనులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. 45వ వార్డులోని సచివాలయాల్లో పర్యటించిన వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావులు ఉత్తర నియోజకవర్గ సచివాలయాలకు సంబంధించి రూ.40 లక్షలు, భీమిలి నియోజకవర్గ సచివాలయాలకు సంబంధించి రూ.20 లక్షలు మంజూరు కాగా వీటితో అభివృద్ధి పనులు చేయించారు.

అనేక పనులు పూర్తిచేశాం



వార్డులో అనేక అభివృద్ధి పనులు పూర్తిచేశాం. సంతోషిమాత కాలనీలో త్వరలోనే సామాజిక భవనం నిర్మిస్తాం. ఇటీవల ఏఎస్సార్ నగర్‌లో టిడ్కో ఇళ్లను ప్రారంభించాం. ఈ ప్రాంతంలో పట్టణ ఆరోగ్య కేంద్రం లేదా పాఠశాల ఏర్పాటు చేస్తే నివాసులకు బాగుంటుంది. ఈ విషయమై నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజును కోరాం. దీనికి ఆయన కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు.

– కంపా హనోకు, కార్పొరేటర్, 45వ వార్డు

'జగనన్న సురక్ష' చరిత్రాత్మకం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన, సేవలు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకొని, అక్కడికక్కడే పరిష్కరించాలనే ఆలోచనతో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్రంలో చరిత్ర సృష్టించిందన్నారు. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తన ప్రతినిధులుగా అధికారులు, వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని తక్షణం పరిష్కరించాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో, ప్రజలెవరూ ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని పేర్కొన్నారు. జూలై 1 నుంచి 31 వరకు విజయవంతంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, కె.వి.ఎన్.శశికళ, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, ఆళ్ల శ్రీనివాస్, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాస్, నూకరాజు, గంగామహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



కోలా గురువులును సత్కరిస్తున్న కొల్లాబత్తుల వెంగళరావు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితుడైన కోలా గురువులును గురువారం వైఎస్సార్‌సీపీ 45, 46, 47, 48 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు సవరపు జయకుమార్, వార్డు సోషల్ మీడియా కన్వీనర్ భరత్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతమ్మధార: గురుద్వారా దరి సీతంపేట ప్రాంత శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు గురువారం 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ నిధులు రూ.16 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామ్మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, సాడి కేశవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు సారిపల్లి సంతోష్, వార్డు యూత్ అధ్యక్షుడు సన్నీ, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కె.కోటపాడుకు చెందిన పోచర్ల అమ్మాజీ, ఆమె అల్లుడు కనకబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం సాయంత్రం కేజీహెచ్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఓ కారు ఢీకొనడంతో ఆమె ఎడమ చేతికి గాయాలయ్యాయి. అమ్మాజీ అల్లుడు స్వల్పంగా గాయపడ్డాడు. వారిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రురాలు గురువారం ఫిర్యాదు చేయడంతో సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన



సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు

కంచరపాలెం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 54వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 104 ఏరియా మహారాణి వీధి-2 సచివాలయం 299 జ్యోతినగర్, బాపూజీనగర్ ప్రాంతాల్లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ చల్లా రజినితో కలిసి ఆయన ఇంటింటికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతి గడపలో తెలుసుకున్న సమస్యలను అక్కడే పరిష్కరించేలా జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ ఆశయమన్నారు. జగనన్న సురక్ష లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డైరెక్టర్లు కాయిత వెంకటలక్ష్మి, రాయుడు శ్రీను, పార్టీ వార్డు అధ్యక్షులు చల్లా ఈశ్వరరావు, రత్నాకర్, నాయకులు కె.చిరంజీవి, అచ్యుతరావు, వెంకటేష్, గౌరీ ప్రసాద్, రమణమ్మ, ప్రకాష్‌రావు, శంకర్, శివ ప్రసాద్, రాధాకృష్ణ, పైడిరాజు, హరినాథ్‌రెడ్డి, శ్రీను, మోహన్, సూర్యప్రకాష్, రమేష్, నాగరాజు, సీనియర్ నాయకులు గోవింద్, షేక్, బాబ్జీ, హరిపట్నాయక్, అశోక్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మహిళా నాయకులు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

17 నుంచి కుంకుమ పూజలు



అమ్మవారి ఆలయంలో శ్రీచక్రం

సీతమ్మధార: ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 17 వరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో కొలువైన మహాలక్ష్మి దుర్గమ్మ వారి ఆలయంలో శ్రీచక్రానికి కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి పూజలు చేస్తామన్నారు. ఈ నెల 4 ,13 తేదీల్లో త్రయోదశి సందర్భంగా రామలింగేశ్వర స్వామికి ప్రదూషకాల అభిషేకం, అష్టమిని పురస్కరించుకుని 8వ తేదీ సాయంత్రం 5.30 గంటల నుంచి కాలభైరవ స్వామికి అభిషేకాలు నిర్వహిస్తామని చెప్పారు.

డీఆర్ఎం కలిసిన బీజేపీ నాయకులు



డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బీజేపీ నాయకులు

తాటిచెట్లపాలెం: డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌ను గురువారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. వారిలో జి.చంద్రశేఖర్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.విజయానందరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ఎస్.వి.ఎస్.ప్రకాషరావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న గర్భిణులు, బాలింతలతో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం 14వ వార్డు ఏఎస్సార్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల(టేక్ హోం రేషన్)ను కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల సౌకర్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ప్రవేశపెట్టారన్నారు. సమాజంలో మాతా, శిశు మరణాలు తగ్గాలంటే గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, మాతా, శిశు మరణాలను నివారించడమే కాకుండా ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివచ్చని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సెంటర్ టీచర్ సుజాత, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి శ్యామల, మంగ, హేమలత, ఆశ వర్కర్స్ భవానీ, జుబెద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరి సత్యనారాయణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాకు డిమాండ్



నరసింహనగర్ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా కౌంటర్ వద్ద జనం



కంచరపాలెం రైతుబజార్‌లో మహిళల క్యూ

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో గురువారం సబ్సిడీపై టమాటాలు విక్రయించారు. ఐదు రోజుల విరామం తర్వాత సబ్సిడీ టమాటా బజారుకు రావడంతో జనం ఎగబడ్డారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.160 నుంచి 180కు విక్రయిస్తుండగా.. రైతుబజార్లలో ప్రభుత్వం రాయితీపై కిలో రూ.50కే అందిస్తోంది. దీంతో సబ్సిడీ టమాటాకు ఎక్కడా లేని డిమాండ్ పెరిగింది. గురువారం ఈ రైతుబజార్‌కు 1,299 కిలోలు (50 ట్రేట్లు) టమాటా వచ్చింది. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 6.30 నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయించారు. ఆధార్ లేదా రేషన్ కార్డు పట్టుకొచ్చిన వారికి, వివరాలు నమోదు చేసుకుని మనిషికి కిలో చొప్పున అమ్మకం జరిపారు. రైతుబజార్ ఈవో పి.చినబాబు, సహాయకుడు సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కంచరపాలెం రైతుబజార్‌లో..

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా కోసం వినియోగదారులు బారులు తీశారు. ఇక్కడ రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం 6 గంటల నుంచి కిలో టమాటా రూ.50కు రాయితీపై విక్రయించారు. సుమారు 16 క్వింటాళ్ల టమాటాను విక్రయించినట్లు రైతుబజార్ ఈవో కృష్ణమోహన్ తెలిపారు.

మురళీనగర్‌కు అయోధ్య శ్రీరామ పాదుకలు



పాదుకలకు ఆహ్వానం పలుకుతున్న మురళీనగర్ రామాలయ కమిటీ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ సీతారామ ఆలయంలో అయోధ్య శ్రీరామ పాదుకలకు గురువారం ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అయోధ్య భాగ్యనగర్ శ్రీసీతారామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సందర్శనలో భాగంగా గురువారం ఈ పాదుకలు మురళీనగర్ సీతారామాలయానికి చేరుకున్నాయి. వీటికి ఆలయ పండితులు పూర్ణకుంభం నడుమ స్వాగతం పలికారు. పాదుకలకు భక్తులు క్షీరాభిషేకం, విశేష పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయల అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యపారాయణ గ్రంథం భాగవతం



ప్రసంగిస్తున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న ఆధ్యాత్మిక లహరి ప్రవచనాల్లో భాగంగా గురువారం సాయంత్రం భాగవతం భక్తితత్వం అనే అంశంపై కవి, సహృదయ సాహితి సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ ప్రసంగించారు. మానవులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించే దారి, దీపంగా భాగవతాన్ని అభివర్ణించారు. భాగవతంలోని నవ విధ భక్తి మార్గాలను ప్రస్తావించి జీవితాన్ని ఎలా మలుచుకోవాలో మార్గదర్శనం చేస్తుందని ఆయన అన్నారు. అనంతరం లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. భాగవత పురాణం నిత్య పారాయణ గ్రంథమని పేర్కొన్నారు. ముఖ్య అతిథి నారాయణనంద భారతీస్వామి ప్రారంభ వాక్యాలు పలికారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ప్రసంగకర్తను సన్మానించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'

సీతమ్మధార: నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు తమ సమస్యలపై ఆయనకు విన్నవించుకున్నారు. వారి వద్ద నుంచి వినతిపత్రాలు, దరఖాస్తులను కె.కె.రాజు తీసుకుని అధికారులతో మాట్లాడారు. కొన్ని సమస్యలను తక్షణం పరిష్కరించామని, మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాధారణ ప్రయాణికుల పాట్లు

తాటిచెట్లపాలెం: రైళ్లలో ప్రయాణించే సాధారణ ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైల్లో నిల్చోలేరు..కూర్చోలేరు. కనీసం మరుగుదొడ్లకు, మూత్రవిసర్జనకు కూడా వీలులేని పరిస్థితి. గురువారం భాగల్‌పూర్ నుంచి బెంగళూరు వెళ్తున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గురువారం మధ్యాహ్నం విశాఖ చేరుకుంది. అంతే అప్పటివరకు ఎంతో ఓపిగ్గా ఎదురు చూసిన సాధారణ ప్రయాణికులు ఒకరివెంట ఒకరు రైలు దిగి ట్రాక్‌ల వెంబడి మూత్రవిసర్జన కోసం పరుగులు తీశారు. ట్రాక్‌లపై మూత్రవిసర్జన చేయడం ప్రమాదం, నేరం అని తెలిసి కూడా వేరే దారి లేక బోగీల్లో బాత్రూంలోకి ప్రవేశించడానికి అవకాశం లేక ఇలా చేయడం రైల్వే అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించినట్టు అయింది.

బాలికా విద్యతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ

విశాఖ లీగల్ : బాలికా విద్యతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అన్నారు. గురువారం ఆమె పాతపోస్టాఫీసు వద్ద ఉన్న క్వీన్‌మేరీ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. సంపదను దోచుకెళ్లొచ్చు కానీ చదువును ఎవరూ దోచుకెళ్లలేరని చెప్పారు. సమాజ ఉన్నతికి చదువు దోహదపడుతుందని చెప్పారు. డబ్బు ఎంత వాడితే అంత ఖర్చవుతుందని, ఎంత చదివితే అంత విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. బాలికలకు చదువుతోపాటు ఆటలు, వ్యాయామం వంటి అంశాల్లోనూ అవగాహన కల్పించాలన్నారు.

సాధనతోనే లక్ష్యం సాకారం



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: నిత్యం క్రమపద్ధతిలో సాధన చేస్తే లక్ష్యం సాకారం అవుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఏయూ అలుమ్ని సమావేశ మందిరంలో ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు, అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆంగ్ల భాషపై పట్టు సాధించాలంటే ఆరు నెలల కాలం కష్టపడాలని సూచించారు. ఇతరులతో పోల్చుకోవడం మానివేయాలని, మన సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఆలోచన చేయాలన్నారు. అనంతరం అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అవకాశాలు, ప్రవేశాలు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 8న వైజాగ్ జూ మారథాన్

దాబాగార్డెన్స్ : వైజాగ్ ట్రైల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 8న వైజాగ్ జూ మారథాన్ నిర్వహించనున్నట్టు కార్యక్రమ నిర్వాహకులు కీర్తి మహాజన్, కృష్ణ చైతన్య తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో మారథాన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ నుంచి ఈ మారథాన్ ఉంటుందని, ఇందులో 4 రకాలున్నాయన్నారు. 21కే, 10కే, 5కే, 3కే పేరిట ఈ పోటీలు ఉంటాయన్నారు. మారథాన్‌లో పాల్గొనే క్రీడాకారులు, నగర ప్రజలు, ఆసక్తి గల వారంతా ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వీటీఆర్ఏ.రన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న మారథాన్ రన్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, కార్యదర్శి ఎం. రవి తదితరులు పాల్గొన్నారు.

ఐపీఆర్‌పై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు



కోర్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో ఐపీఆర్‌పై వారం రోజుల ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో కోర్సు వివరాలతో కూడిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు అండర్‌స్టాండింగ్ పేటెంటింగ్ సిస్టమ్స్ ఇన్ ఇండియా అంశంపై వారం రోజుల ఆన్‌లైన్ కోర్సు నిర్వహిస్తామన్నారు. శిక్షణ కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, స్టార్టప్ సంస్థల నిర్వాహకులకు ఈ కోర్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి వివరాలను ఏయూ వెబ్‌సైట్‌తో పాటు 95992 29217 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీపీఐఐటీ-ఐపీఆర్ చైర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం, ఐపీఆర్ అటార్నీ యు.అశోక్ హేమంత్, సీఐపీఆర్ డాక్టర్ డి.హరిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం



వస్తువులను పరిశీలిస్తున్న కె.కె.రాజు, జెడ్సీ కృష్ణ, రజని

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధి 54వ వార్డు జ్యోతినగర్‌లో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించారు. జీవీఎంసీ స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో భాగంగా జోన్-5కు సంబంధించి రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్ఆర్ఆర్) సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. పనికిరాని వస్తువులను తిరిగి ఉపయోగించేలా ప్రజలకు ఈ సెంటర్‌లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం సెంటర్‌లో ప్రదర్శించిన వేస్ట్ మెటీరియల్‌తో చేసిన వస్తువులను వారు పరిశీలించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, కార్పొరేటర్ చల్లా రజిని, చల్లా ఈశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, వార్డు శానిటరీ సెక్రటరీ నాయుడు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.